క్లుప్తంగా

బాధితుడికి మిత్రుల అండ



ఆర్థికసాయం అందిస్తున్న సురేందర్

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌కు చెందిన సదానందం పక్షవాతంతో బాధపడుతున్నాడు. అతడితో కలిసి కన్కపూర్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన మిత్రులు అతడి అనారోగ్యం గురించి తెలుసుకున్నారు. తలో కొంత జమ చేసి రూ.25 వేలను బుధవారం బాధితుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సదానందం మిత్రులు దెబ్బడి సురేందర్, గంగాధర్, ఇంత్యాస్ అలీ, హైమద్, భూమానందం, అంజయ్య, విఠల్, కల్లెడ కిష్టయ్య, దేవేందర్ ఉన్నారు.

పంటల వివరాల నమోదు

ముధోల్: మండలవ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను అధికారులు నమోదు చేసుకుంటున్నారు. బుధవారం ఏఈవోలు సయ్యద్, సిరాజ్, ప్రవీణ్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

కన్కపూర్ ఎత్తిపోతల పథకం కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో బ్రహ్మేశ్వర ఎత్తిపోతల పథకం కమిటీని బుధవారం ఇదే మండలంలోని అబ్దుల్లాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎత్తిపోతల పథకం కమిటీ అధ్యక్షుడిగా కట్ట నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొత్తిమీర రాజన్న, కోశాధికారిగా దెబ్బడి భూమన్న, సభ్యులుగా గొల్ల పద్మ, బండారి రాజవ్వ, కొత్తూరి పెద్ద సాయన్న, దెబ్బడి దేవేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కన్కపూర్ సర్పంచ్ నరేశ్, అబ్దుల్లాపూర్ సర్పంచ్ రమణారెడ్డి, రాజారెడ్డి, గంగాధర్, మహేందర్‌రెడ్డి, రాజులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ సంబురాలు

ముధోల్: ముధోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విఠల్ రెడ్డికి టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ముధోల్‌లో సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, వైస్‌ఎంపీపీ లావణ్య రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయు ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించా లని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్య గోవింద్, ఎస్.లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఖానాపూర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన రెండు డీఏలతోపాటు మెడికల్, జీపీఎఫ్ బిల్లులు చెల్లించాలన్నారు. రెండో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి 20శాతం ఐఆర్ ప్రకటించడంతోపాటు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. సమావేశంలో నాగేష్‌బాబు, ప్రేం సింగ్ తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కడెంలో మానవహారంగా విద్యార్థులు

కడెం: 18 ఏళ్లు నిండి.. ఓటుహక్కు లేనివారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.రాజేశ్వరి అన్నారు. 'వోట్ ఫర్ ష్యూర్' అనే నినాదంతో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ చిన్నయ్య, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్‌లో 5కే రన్

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వెంట బుధవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ మాట్లాడుతూ.. ఓటుహక్కు ప్రాధాన్యత తెలిపేందుకు 5కే రన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఓటు వజ్రాయుధమని.. అర్హులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భూక్య రమేష్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏళ్ల కల.. నెరవేరిన వేళ

- కుంటాలకు జూనియర్, ముధోల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- విద్యార్థులకు తగ్గనున్న ఆర్థికభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించిన భవనం

ముధోల్: కుంటాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో నియోజకవర్గంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ముధోల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నా.. డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు డిగ్రీ చదివేందుకు భైంసా, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లేవారు. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు డిగ్రీ చదువుకు దూరమయ్యేవారు. దీంతో నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులతోపాటు చదువుకు దూరమయ్యే వారికి మేలు జరుగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేశారు. స్థానిక నాయకులు సైతం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నపం చేశారు. దీంతో ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది

నాలుగు మండలాల్లోని ప్రజలకు మేలు..

ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ముధోల్ తోపాటు లోకేశ్వరం, బాసర, తానూరు మండలాల్లోని ఆయా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు జరగనుంది.ముధోల్‌లో ప్రైవేటు డిగ్రీ కళాశాలలున్నా.. వాటిలో పరిమిత సంఖ్యలోనే సీట్లు ఉన్నాయి. మరోవైపు ఫీజుల భారం ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను డిగ్రీ చదువుకు దూరం చేస్తున్నారు.

విద్యార్థులకు మేలు..



భైంసా: ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వం నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తుంది. ఇప్పటికే జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది. ఇప్పుడు ముధోల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుంటాలకు జూనియర్ కళాశాల మంజూరైంది. ఈ రెండు కళాశాలల ఏర్పాటుతో నియోజకవర్గంలో ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగనుంది. రానున్న రోజుల్లో విద్యావ్యవస్థ పటిష్టతకు మరిన్ని చర్యలు చేపడుతాం.

– ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ముధోల్

భవనం పరిశీలన..

ముధోల్‌లో గిరిజన బాలికల పాఠశాల.. నూతన భవనంలోకి మార్చగా.. ఈ పాఠశాల పాత భవనాన్ని డిగ్రీ కళాశాల కోసం అధికారులు పరిశీలించారు.

కుంటాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు..

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం కుంటాలకు జూనియర్ కళాశాల మంజూరు చేయడంపై మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని 12 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. ఇక్కడ కళాశాల లేక నిర్మల్, భైంసా తదితర పట్టణాలకు వెళ్లి ఇంటర్ చదువుకునేవారు. తొమ్మిదేళ్ల కిందట ప్రభుత్వం కుంటాలలో ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి.. ఇందులో ఇంటర్ విద్యార్థులకు అవకాశం కల్పించారు. సీట్లు పరిమితంగా ఉండడంతో కొందరు ఆర్థిక భారమైనా ప్రైవేట్ కళాశాలలకు వెళ్లి చదువుకునేవారు. మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలచారి హయాంలో కుంటాల గ్రామస్తులు రూ. మూడు లక్షల కార్పస్ ఫండ్ ప్రభుత్వానికి చెల్లించారు. అయినప్పటికీ కళాశాల ఏర్పాటులో జాప్యం నెలకొంది.

2018 నుంచి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పలువురు కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవిస్తూ వచ్చారు. ఎమ్మెల్యే, మంత్రి ఐకేరెడ్డి సహకారంతో కుంటాలకు జూనియర్ కళాశాల మంజూరు కావడంతో ఏళ్ల కల నెరవేరింది.

వచ్చే సంవత్సరం నుంచి ఇంటర్ అడ్మిషన్లు..

ఈ విషయమై డీఐఈవో పరశురాం మాట్లాడుతూ కుంటాలలో గ్రామస్తులతో చర్చించి భవనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థుల నుంచి జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

అవకాశాలు పెరుగుతాయి



ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం హర్షనీయం. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు. కళాశాల ఏర్పాటుతో చుట్టు పక్కల ఉన్న మండలాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. దీంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. – అఫ్రోజ్‌ఖాన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు, ముధోల్

పేద విద్యార్థులకు వరం



ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు పేద విద్యార్థులకు వరం. దీంతో గ్రామీణ ప్రాంతాల వారు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు. మంజూరుకు కృషి చేసినవారందరికీ కృతజ్ఞతలు. – జ్యోతి, విద్యార్థిని, ముధోల్

ఫీజుల భారం ఉండదు..



కుంటాలలో జూనియర్ కళాశాల లేక నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేంది. కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు ఫీజుల భారం ఉండదు. ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు తొలగిపోయాయి. – పడకంటి దత్తాద్రి, కుంటాల

ఆయిల్‌పాం సాగు లాభదాయకం

కడెం: ఆయిల్‌పాం సాగు లాభదాయకమని డీజీఎం రామ్మోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నాలుగేళ్లలో పంట దిగుబడి ప్రారంభమవుతుందని.. మధ్యలో ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాయితీపై మొక్కలు, డ్రిప్ అందిస్తున్నట్లు తెలిపారు. పండ్ల తోటల సాగుకు ఆసక్తి కల్గిన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఉద్యాన క్లస్టర్ అధికారిణి సాదుల మౌనిక తెలిపారు. ఏవో సంధ్యారాణి, ఏఈవో సురేశ్ తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కుంటాల: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కల్యాణ్ గజేందర్ పేర్కొన్నారు. కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. రోగులతో దురుసుగా మాట్లాడవద్దని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండడంతో భైంసా ఏరియా ఆసుపత్రికి వెళ్తూ అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన మందులు, సిబ్బంది అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తాటి శివ, జక్కుల గజేందర్, సోమ సత్తయ్య, బోనగిరి రవి, ఎనుగందుల గజేందర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' సర్వే పూర్తి చేయండి

- జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

సోన్: మండలంలోని గ్రామాల్లో గృహలక్ష్మి సర్వే త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న జిల్లాలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మండలవ్యాప్తంగా 5400 మొక్కలు నాటాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వారంలో ఓ రోజు డ్రై డే నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఖలీల్ హైమద్, ఏపీఓ మంజుల, ఐకేపీ ఏపీఎం గంగామణి, పంచాయతీ కార్యదర్శులు ఎఫ్ఏలు, టీఏలు తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లో బుధవారం గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. ప్రత్యేకాధికారి ఏపీఎం వాణిశ్రీ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. కార్యదర్శి చంద్రశేఖర్, ఎఫ్ఏ ఆశన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా తదితర గ్రామాల్లో గృహలక్ష్మి సర్వే కొనసాగుతోంది. దరఖాస్తుదారుల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. గృహలక్ష్మి టీం సభ్యులు తహశీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డీటీ నరేశ్‌గౌడ్, ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



పార్టీలో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలో ఉండేది మరో మూడు నెలలేనని.. తర్వాత వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్‌రూరల్ మండలం వెంగ్వాపేట్ మాజీ ఉప సర్పంచ్ రాస రాజేశ్వర్, వివిధ పార్టీల నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నిర్మల్ నియోజకవర్గంలో కబ్జాల మంత్రిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. పీసీసీ సభ్యులు సాద సుదర్శన్, నాయకులు ఎండీ బాబా, ఎండీ నయీం, నరేశ్, అజయ్‌కుమార్, ఎండీ సమీర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని శ్రీహరిరావు అన్నారు. లక్ష్మణచాంద మండలంలోని న్యూకంజర్‌కు చెందిన 20 మంది, లక్ష్మణచాందకు చెందిన 30 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ అట్ల రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, రవి పాల్గొన్నారు.

శుభ్రత పాటించండి

ముధోల్: రోగాల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ముధోల్ పంచాయతీ ఈవో పవన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తను ఎప్పటికప్పుడు చెత్తవాహనాల్లో వేయాలన్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

చదువుపై దృష్టి సారించండి

కుంటాల: విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ కస్తూరిబాలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలన్నారు. అపరిచితులకు బ్యాంకు వివరాలు చెప్పి సైబర్ మోసాలకు గురికావద్దని సూచించారు. ఎస్ఓ సువర్ణ, ఏఎస్సై దేవరావ్, సిబ్బంది సాదిక్, కల్యాణ్, సవిత తదితరులు పాల్గొన్నారు.

'టంగుటూరి' జయంతి

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ దోనిగామ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన హరీశ్ తండ్రి సాకలి ఎర్రన్న ఇటీవల మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నేతలు పరామర్శించారు.

ఫిర్యాదుదారులకు భరోసానివ్వాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

కడెం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించి భరోసానివ్వాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం డీఎస్పీ కడెం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డులు పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీఐ మోహన్, ఎస్సై రాజు ఉన్నారు.

చంద్రయాన్-3 విజయంపై సంబురాలు



కుంటాలలో జాతీయ జెండాలతో గ్రామస్తులు



ఖానాపూర్‌లో యువకుల సంబురాలు



లోకేశ్వరంలో..



భైంసాలోని ఓ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

కుంటాల: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులు సంబురాలు చేసుకున్నారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంఈవో ముత్యం, ఎస్సై హన్మాండ్లు, ఎంపీవో అబ్దుల్ రహీం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ పాల్గొన్నారు. కుంటాలలో బాణాసంచా కాల్చారు.

లోకేశ్వరం: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో లోకేశ్వరం స్వామి వివేకానంద చౌరస్తాలో యువకులు సంబరాలు చేసుకున్నారు. గంగాధర్, రాజు, శేఖర్, లింగన్న, భోజన్న ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ష్లేర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం నుంచే చంద్రయాన్ విజయవంతం కావాలంటూ విద్యార్థులు మానవహారం నిర్వహించారు. సాయంత్రం పాఠశాల డైరెక్టర్ నరసింహారెడ్డి పాఠశాల ఆవరణలో విద్యార్థులు వీక్షించేలా పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖానాపూర్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో పలువురు యువకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాసమల్ల అశోక్, మునుగూరి నవీన్, కొంక సుభాష్, రాజేశ్, వినయ్, వంశీ, గణేశ్, సాయి, నిఖిల్, తదితరులున్నారు.

భైంసా: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు బుధవారం చంద్రయాన్–3 ఆకారంలో ప్రదర్శన చేశారు. ప్రయోగం విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

'ముదిరాజ్‌లపై చిన్నచూపు వద్దు'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య

భైంసారూరల్: అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా చిన్నచూపు చూడటం సరికాదని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కిష్టయ్య అన్నారు. బుధవారం భైంసాలోని విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వారికి బుద్ధి చెబుతామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఇతర పార్టీలు జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో లక్కడి గంగాధర్, సాయిలు, పోతన్న, బాలాపూర్ లింగం, నవీన్, రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక



రాజేందర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్వర్

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు కదిలి, మాడేగాం, న్యూలోలం, సిర్గాపూర్, కాల్వ తదితర గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు భారీగా బీజేపీలో చేరారు. బుధవారం నిర్మల్‌లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దిలావర్‌పూర్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ ధని నర్సయ్య, వంద మంది వరకు పార్టీలో చేరారు. ఇందులో మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, డి.ముత్యంరెడ్డి, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగం వీరేశ్, సత్యం చంద్రకాంత్, గోపాల్, రాజు పటేల్, ఉదయ్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం జామ్‌కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు బాలకిష్టు రాజేందర్ బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఏలేటి క్యాంపు కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు కరిపే విలాస్, రాజేశ్వర్, వెంకటేశ్, మధుకర్, తిరుమల చారి, మహేందర్, రాంలింగారెడ్డి, కరణ్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు అందించండి



బ్లీచింగ్ వాడే విధానం చెబుతున్న ఈఈ సందీప్

లోకేశ్వరం: గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలని భగీరథ ఈఈ సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓహెచ్ఆర్ ట్యాంకు వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను నీటిలో కలిపే విధానంపై సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భగీరథ ఈఈ సందీప్ మాట్లాడుతూ రోజు గ్రామాల్లో ఓహెచ్ఆర్, మినీ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. వెయ్యి లీటర్ల నీటిలో నాలుగు గ్రాముల బ్లీచింగ్ పౌడర్ వేసి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలను గుర్తించి పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వారి వెంట ఇంజినీర్లు శ్రీనివాస్, సుమన్, పలువురు భగీరథ సిబ్బంది ఉన్నారు.

మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనం



కల్లూర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

కుంటాల: హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెంపదెబ్బ కొట్టడాన్ని నిరసిస్తూ.. బుధవారం మండలంలోని కల్లూర్‌లో ఆయన దిష్టిబొమ్మను బంజారా సమాజ్ సభ్యులు దహనం చేశారు. బంజారా సమాజ్ తాలూకా కన్వీనర్ నాజం సింగ్, జాదవ్ కోటేశ్‌బాబు నాయక్, జాదవ్ రమేశ్, ఆడే కిషన్, భీంరావు, కైలాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా: భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబును నెట్టేసి చెంపదెబ్బ కొట్టిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం జిల్లా కోకన్వీనర్ సుంకెట మహేశ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ముధోల్: మండల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించిన నూతన తహసీల్దార్ అతికొద్దీన్‌ను మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, చింతకుంట మాజీ సర్పంచ్ నరేందర్‌రాథోడ్ సన్మానించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.